సాక్షి వనపర్తి

గురువారం । 9 । నవంబర్ । 2023

I



.. అల్లంత దూరం

కొడంగల్ నియోజకవర్గ ఓటర్లు విలక్షణ తీర్పు ఇవ్వడంలో నిష్ణాతులు.

వివరాలు IIలో ▸



కూలి అందక అవస్థలు

ఉపాధి కూలీలకు సకాలంలో కూలి అందక కుటుంబ పోషణ భారంగా మారుతోంది.

వివరాలు IIIలో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /24.7

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షం పడే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

'అడ్డా' బతుకులు

రోజు కూలితో బతుకులీడుస్తున్న కూలీలు

- సరైన సౌకర్యాలు కల్పించని పాలకులు
- ఎలాంటి ప్రయోజనాలకు నోచుకోని వైనం
- ఆర్థిక భద్రత కల్పించాలని వేడుకోలు



వనపర్తిలోని అడ్డాపై పనుల కోసం వేచి చూస్తున్న కూలీలు

వనపర్తి టౌన్/పెబ్బేర్ రూరల్: రోజువారీ కూలి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు అడ్డా కూలీలు. ఉదయాన్నే ఇంటి పనులు చక్కదిద్దుకొని పూట గడిచేందుకు అడ్డాపైకి చేరి కూలీ పనుల కోసం పడిగాపులు పడుతుంటారు. స్థానికంగా ఉపాధి లేక అడ్డా కూలే జీవనంగా గడుపుతున్న వారు కొందరైతే.. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక మహిళలు, పురుషులు ఆటోలు, జీపులు, బస్సుల్లో పట్టణంలోని అడ్డాపైకి వచ్చేవారు మరి కొందరు. వచ్చిన కూలీలో కొంత రవాణా చార్జీలకు వెచ్చిస్తుండగా.. పని దొరికితే సంతోషం, లేదంటే రాను పోను ఛార్జీలు చేతినుంచి భరించే పరిస్థితి. ఎవరైనా అడ్డా మీదికి వచ్చారంటే చాలు.. ఏ పని ఉంది అంటూ వందలమంది గుమిగూడుతారు. ఉదయం ఏడు గంటల వరకే అడ్డా మీదకు చేరుకొని మధ్యాహ్నం వరకు వేచి చూసి పని దొరకకుంటే నిరాశగా వెనుదిరుగుతారు. వీరికి కార్మికశాఖ అందించే ప్రయోజనాలపై ఎలాంటి అవగాహన లేకపోవడంతో కనీసం గుర్తింపునకు కూడా నోచుకోవడం లేదు. ఆధునిక సమాజంలో పాలకులు మారినా తమ బతుకులు మారడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు ఇంటి స్థలం, డబుల్ బెడ్రూం ఇళ్లు, సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని, మహిళా కూలీల రక్షణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు. మహిళల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆకతాయిలు వేధింపులకు గురిచేసిన ఘటనలూ ఉన్నాయి. అడ్డా కూలీలకు వయసుతో సంబంధం లేకుండా నెల నెల పింఛన్ ఇవ్వాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు.



చిమనగుంటపల్లి నుంచి ఆటోలో వచ్చిన కూలీలు

జంగ్ తెలంగాణ · ఓటర్ల ఎజెండా

పింఛన్ ఇవ్వాలి



ప్రస్తుతం నా వయసు 64 ఏళ్లు. నేను చిన్నతనం నుంచి అడ్డా కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. నేటికీ పింఛన్ కూడా ఇవ్వడం లేదు. అడ్డా కూలీలకు ప్రత్యేకంగా పింఛన్ సౌకర్యం కల్పించాలి.

– రాములు, దావాసిపల్లి

గుర్తింపు కార్డులు ఇవ్వాలి..



ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్డా కూలీలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేయాలి. అదేవిధంగా ఆకతాయిల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– మహేష్, దళితవాడ, వనపర్తి

బీమా కల్పించాలి..



వచ్చిన కూలీ సరిపోక కుటుంబ పోషణే భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి ప్రమాదం జరిగిన ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అడ్డా కూలీల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రూ.పది లక్షల ఆరోగ్య, ప్రమాద బీమా కల్పించాలి.

– తిరుపతమ్మ, ఖాసీంనగర్

ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలి..



అడ్డా కూలీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదు. గ్రామాల్లో పనులు లేక రోజు ఛార్జీలు చెల్లించి వాహనాల్లో పట్టణానికి వస్తున్నాం. పని దొరికితే సరి.. లేదంటే ఉట్టి చేతులతో ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. పాలకులు ప్రత్యేక దృష్టి సారించి ఆదుకోవాలి.

– అనసూయమ్మ, చందాపురం

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి..



చాలామంది కూలీలు సొంత గూడు లేక అద్దె గదుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు వచ్చిన కూలీ డబ్బులు సరిపోవడం లేదంటే అదనంగా అద్దె భారం అవుతోంది. అడ్డా కూలీలకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి.

– శివమ్మ, చిమనగుంటపల్లి

కనీస సౌకర్యాలు లేవు..



అడ్డా కూలీలకు ఇష్టారీతిన కూలి చెల్లిస్తున్నారు. రోజువారీగా పనికి తగ్గ కూలి చెల్లించేలా పాలకులు చర్యలు తీసుకోవాలి. గ్రామాల నుంచి వచ్చే మాకు కనీసం తాగునీరు, నిల్వ నీడ లేదు. పని దొరికే వరకు అలాగే నిలబడాల్సి వస్తోంది.

– వి.చంద్రయ్య, పెద్దగూడెం

న్యూస్‌రీల్

కురుమూర్తిరాయుడి పట్టువస్త్రాల తయారీ




అమరచింత: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామికి సమర్పించే పట్టు వస్త్రాల తయారీ పనులను బుధవారం ప్రత్యేక పూజతో ప్రారంభించారు. పట్టణానికి చెందిన పద్మశాలి కులస్తులు ప్రతి సంవత్సరం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారితో పాటు లక్ష్మీదేవికి పట్టువస్త్రాలను సమర్పిచడం ఆనవాయితీ. కురుమూర్తి ఆలయ అర్చకులతో పూజలు నిర్వహించి నేత పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో లచ్చన్న, మోహన్, చింతన్న, శ్రీనివాసులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు స్వల్పంగా ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్‌ పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 98, కోయిల్ సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 300 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.355 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం



మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తి స్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. వ్యవసాయ అవసరాల కోసం ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,150 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మరో 20 క్యూసెక్కులు వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

హైవేపై నిరంతరం నిఘా



అడ్డాకుల: జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై వాహనాల తనిఖీని ముమ్మరంగా చేస్తూ నిరంతరం నిఘా ఉంచాలని మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ పోలీసులను ఆదేశించారు. అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును బుధవారం ఆయన పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు చేస్తున్న తనిఖీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రధానంగా రహదారిపై డబ్బులు, మద్యం సరఫరా చేసే వాహనాలపై నిఘా పెంచాలని సూచించారు. అనంతరం అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఐ మాధవరెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం



క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: దక్షిణ తెలంగాణలో వనపర్తి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు, వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని.. చేసిన అభివృద్ధి నచ్చితే ఆదరించాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని.. గోడ మీద పిల్లిలా పూటకో వేషం వేసే వాళ్లను నమ్మొద్దని సూచించారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ గద్వాల ఎన్నికల ఇన్‌చార్జ్..

గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్, పెద్దమందడి మండలం మోజర్లకు చెందిన మొగిలి సత్యారెడ్డి బుధవారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకున్న పరిణామాలు జీర్ణించుకోలేక పార్టీ మారినట్లు తెలుస్తోంది. ఆయనకు మంత్రి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లాకేంద్రంలోని 18వ వార్డు సత్యమ్మ శారద, నాయకుడు ప్రేమ్‌కుమార్, నవకాంత్ ఆధ్వర్యంలో 40 మంది, గోపాల్‌పేట మండలం నాగరాజు ఆధ్వర్యంలో 33 మంది యువకులు కాంగ్రెస్, బీజేపీల నుంచి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

నేడు వాలీబాల్ జిల్లా జట్ల ఎంపికలు

వనపర్తిటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-14 బాల బాలికల వాలీబాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ గురువారం జిల్లాకేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి.సురేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 9లోపు హాజరుకావాలని పేర్కొన్నారు.

తగ్గని ఉల్లి ధర



దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధర ఏమాత్రం తగ్గలేదు. గత వారం నమోదైన ధరలే మళ్లీ వచ్చాయి. వేలంలో క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6 వేలు, కనిష్టంగా రూ.5,500 పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌కు తక్కువగా ఉల్లి రావడంతో కొందరు వ్యాపారులు ఇతర మార్కెట్‌లలో కొనుగోలు చేసిన ఉల్లిని తెచ్చి నేరుగా అమ్ముకున్నారు. 45 కిలోల బస్తా రూ.3 వేల నుంచి రూ.2,750 వరకు విక్రయించారు. కొత్తగా దిగుబడి వచ్చిన ఉల్లిని కూడా బస్తా ధర రూ.2,500 వరకు అమ్మారు.

మార్కెట్‌లో నిండిన ధాన్యం రాసులు

వరి కోతలు ప్రారంభమై దిగుబడులు రావడంతో రైతులు పెద్దఎత్తున మార్కెట్‌కు ధాన్యం అమ్మకానికి తెచ్చారు. బుధవారం వివిధ గ్రామాల నుంచి 10 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. మంగళవారం ఖరీదు చేసిన ధాన్యం తూకాలు ముగిసిన లోడింగ్ చేయకపోవడంతో మార్కెట్‌లో ఒకవైపు కుప్పలుగా పోసిన ధాన్యం ఉండగా.. మరోవైపు తూకాలు వేసిన ధాన్యం బస్తాలతో నిండిపోయింది. సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,223, కనిష్టంగా రూ.1,909గా ధ రలు నమోదయ్యాయి. హంస గరిష్టంగా రూ. 1,950, కనిష్టంగా రూ.1,711 పలికింది. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,309, కనిష్టంగా రూ.5,209 ధరలు వచ్చాయి.

అలకపాన్పుపై అభ్యర్థి?

- స్థానిక నేతల సహకారం లేదంటూ నామినేషన్ దాఖలుకు నిరాకరణ
- పోటీకి సిద్ధమవుతున్న బీసీ నేతలు

బీజేపీలో అనిశ్చితి..!



వనపర్తి: వనపర్తి నియోజకవర్గ బీజేపీలో అనిశ్చితి నెలకొంది. టికెట్‌ను పెద్దమందడి మండలం బలిజపల్లి-జంగమాయపల్లి జంట గ్రామాలకు చెందిన అశ్వత్థామారెడ్డికి కేటాయించిన విషయం తెలిసిందే. ముందు నుంచి పార్టీకోసం పని చేస్తున్న తమకు కేటాయించకుండా అన్యాయం చేశారంటూ అసమ్మతి రాగం అందుకున్న స్థానిక నాయకులతో పొసగక బుధవారం తాను పోటీలో ఉండబోనని పార్టీ రాష్ట్ర పెద్దలకు తేల్చి చెప్పినట్లు స్థానిక కమలనాథుల్లో చర్చ జరుగుతోంది. స్థానిక నాయకుల నుంచి ఎలాంటి సహకారం అందటం లేదని బీజేపీ అగ్రనేత ఈటల రాజేందర్‌కు వివరించి పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారని పార్టీ క్యాడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అభ్యర్థితో మాట్లాడేందుకు 'సాక్షి' యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. స్థానిక నాయకులు మాత్రం అవునసే సమాధానం ఇస్తున్నారు. పోటీలో ఎవరుంటారనే విషయం గురువారం తేలుతుందని చెప్పారు.

సిద్ధమవుతున్న బీసీ లీడర్లు..

ఇదే అదునుగా భావించిన ఇద్దరు బీసీ నేతలు, మరో యువమోర్చా జిల్లా నాయకుడు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలుడే సమయంలో పోటీలో నిలిచేందుకు ఆసక్తిగల వారు పేర్లు ఇవ్వాలని పార్టీ రాష్ట్రశాఖ సూచన మేరకు జిల్లాకేంద్రానికి చెందిన నాయకులు డి.నారాయణ, బి.కృష్ణ, అనుజ్ఞారెడ్డి వినతులు సమర్పించారు. అనూహ్యంగా ఈటల రాజేందర్ కోటాలో వనపర్తి టికెట్ అశ్వత్థామారెడ్డికి పార్టీ హైకమాండ్ కేటాయించింది. మొదట్లో అసమ్మతి రాగం వినిపించినా.. నెమ్మదిగా సద్దుమణుగుతుందని భావించిన పార్టీ పెద్దలకు ఒక్కసారిగా అభ్యర్థి నిర్ణయం షాక్ ఇచ్చినట్లయింది. నామినేషన్ దాఖలుకు మరో రెండురోజుల్లో గడువు ముగుస్తున్న పరిస్థితుల్లో పార్టీలో కలవరం నెలకొంది.

వికసించని కమలం..

గత ఎన్నికల్లో కమలం పార్టి ఇంపోర్టెడ్ అభ్యర్థిని బరిలో దించగా.. 3,168 ఓట్లతో మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఇంతకంటే ముందు పోటీ చేసిన అభ్యర్థులు సైతం పెద్దగా ఓట్లు తెచ్చుకున్న దాఖలాలు లేవు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలపడినా.. స్థానికంగా కమలం పార్టీ వికసించే దాఖలాలు కనిపించడం లేదు. దీనికితోడు అభ్యర్థి ఎంపికై వచ్చినా అసంతృప్తి వాదం పార్టీని కొంతమేర నిరుత్సాహానికి గురిచేసింది. అంతలోనే అభ్యర్థి అలకపాన్పు ఎక్కటం పార్టీలో అనిశ్చితి నెలకొనేలా చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ నిర్ణయం మేరకు అధిష్టానం టికెట్ కేటాయించిన అభ్యర్థి బుధవారం నామినేషన్ దాఖలు చేయాల్సి ఉండగా.. పోటీ నుంచి తప్పుకుంటున్నానంటూ నామినేషన్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక పథకాలు

- రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



కొత్తకోటలో మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ

కొత్తకోట: ఉమ్మడి రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నోచుకోలేదని.. ప్రత్యేక రాష్ట్రంలో గుర్తింపు తీసుకొచ్చి, అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం పట్టణంలోని శివ గార్డెన్స్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ముస్లింలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, బీఆర్ఎస్ పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఒక్క కుటుంబం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. నియోజవర్గంలో 12,500 మందికి షాదీ ముబారక్ చెక్కులు, షాదీఖానా, మైనార్టీబంధు అందజేసినట్లు వివరించారు. దేవరకద్ర నియోజకవర్గంలో రెండు మైనార్టీ గురుకులాలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, సయ్యద్ ఇబ్రహీం, జాబీర్‌బిన్ సాహిద్, అబ్దుల్, బాబా, తాహెర్ పాల్గొన్నారు.

ఐదోరోజు మూడు నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి

వనపర్తి: వనపర్తి నియోజకవర్గం నుంచి బుధవారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు తెలిపారు. పెద్దమందడి మండలం మంగంపల్లికి చెందిన తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ నుంచి, మంచిర్యాల జిల్లా ఖాజీపేట మండలం దేవాపూర్‌కు చెందిన గొండి వెంకటరమణ స్వతంత్ర అభ్యర్థిగా, రేవల్లి మండలానికి చెందిన బంకల ఎల్లయ్య ధర్మ సమాజ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు ఐదు నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- పీఆర్టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్



మాట్లాడుతున్న సుంకరి భిక్షంగౌడ్

వనపర్తిటౌన్: అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో సంఘం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. వివిధ రకాల బకాయి బిల్లులను ఈ నెల 15లోగా చెల్లించాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పల్లా శ్రీనివాసులు, హేమలత, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, రంగారెడ్డి, కేశవులు, ఉపాధ్యాయులు విష్ణు, జి.ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, పి.సురేష్‌కుమార్, లోకారెడ్డి, సరస్వతి, అనిత, రాణి, జైపాల్‌రెడ్డి, సి.ఈశ్వర్, వి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం..

పీఆర్టీయూ తెలంగాణ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, రంగారెడ్డి, కేశవులు వ్యవహరించారు. అధ్యక్షుడిగా టి.మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసులు, సహ అధ్యక్షులుగా విష్ణు, జి.ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగరాజు, పి.సురేష్‌కుమార్, లోకారెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా సరస్వతి, అనితారాణి, కార్యదర్శులుగా జైపాల్‌రెడ్డి, సి.ఈశ్వర్, మహిళా కార్యదర్శులుగా వి.రాజేశ్వరి ఎన్నికయ్యారు.

పిచికారీ సమయంలో రక్షణ కీలకం

బిజినేపల్లి: పంటల్లో చీడ పీడల నివారణ కోసం చేసే పిచికారీల సమయంలో రైతులు తలకు, చేతులకు తగిన రక్షణ ఏర్పాటు చేసుకోవాలని పాలెం కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల సూచించారు. బుధవారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో క్రిమి సంహారక మందుల పిచికారీ సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డా.శైల మాట్లాడారు. రైతులు పిచికారీ చేసే సమయంలో మాస్క్, తలకు షీల్డ్, టోపీ, చేతికి తొడుగులు, బూట్లు తప్పక ధరించాలని ప్రదర్శన ద్వారా సూచించారు. రసాయన డబ్బాలను వాడిన తర్వాత పొలంలో కానీ, రోడ్లపై పారవేయకుండా భూమిలో పాతిపెట్టాలన్నారు. ఈ డబ్బాలను చెరువుల్లో, నీరు ప్రవహించే ప్రాంతాల్లో వేయరాదన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.ఆదిశంకర్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే : సీపీఐ(ఎంఎల్)



సమావేశంలో మాట్లాడుతున్న కేజీ రాంచందర్

అమరచింత: పేదల అభ్యున్నతికి పాటుపడుతామన్న పార్టీల నేతలు నేడు సొంత ఆస్తుల సంరక్షణ, సంపాదనకే పరిమితమయ్యారని సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేజీ రాంచందర్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని మార్క్ భవనంలో నిర్వహించిన పార్టీ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకేజాతి పక్షులని.. నిత్యం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వమంటే.. కులాల ప్రాతిపదికన విభజించి సంక్షేమం పేరిట ప్రజల్లో విద్వేషాలు నింపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజాక్షేత్రంలోకి వెళ్తున్నామని చెప్పారు. పేదలకు ఇచ్చే రాయితీ సరుకులు విడతల వారీగా ఎత్తేసి కేవలం బియ్యంతో సరిపెడుతున్న పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులు, రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నా.. సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతామని ప్రగాల్భాలు పలకడం వింతగా ఉందని తెలిపారు. వ్యవసాయ, కార్మిక చట్టాల రద్దు, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడంతో పాటు ఉపాధిహామీ పథకం నిధులు తగ్గించడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానమన్నారు. ఎన్నికల్లో ప్రజలకు మేలు చేసే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, రాజన్న, హన్మంతు, రాజు పాల్గొన్నారు.

హామీలు మరిచిన పార్టీలకు గుణపాఠం : సీపీఐ



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి అరాచక పాలన సాగిస్తున్న పార్టీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ప్రజా సమస్యలను ప్రస్తావించే వామపక్ష పార్టీల గొంతు నులిమే ప్రయత్నం చేయడంతో పాటు అక్రమ కేసులు నమోదు చేయిస్తున్న వారిని ఓడించాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆత్మకూర్‌లో నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని.. నాలుగు రోజుల వ్యవధిలో జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శి అబ్రహం, భాస్కర్, నాయకులు మోషా, కుతుబ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రియోగం.. అల్లంత దూరం

- కొడంగల్ నియోజకవర్గానికి 56ఏళ్లుగా దక్కని అదృష్టం
- 1967లో అచ్యుతారెడ్డికి 'మంత్రి పదవి'
- ఐదు సార్లు గెలిచిన గురునాథ్‌రెడ్డికి లభించని పదవి
- ప్రస్తుతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ


కొడంగల్ పట్టణ వ్యూ..

కోస్గి: నియోజకవర్గ ఓటర్లు విలక్షణ తీర్పు ఇవ్వడంలో నిష్ణాతులు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 2014లో తెలంగాణ ఉద్యమాన్ని సైతం లెక్కచేయకుండా కొడంగల్‌లో తెలుగుదేశం పార్టీని గెలిపించారు. ఇక్కడ ఆది నుంచి కాంగ్రెస్, టీడీపీల మధ్యనే పోటీ ఉండేది. ప్రస్తుతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ఉంది. శాసనసభ్యుల్లో గురునాథ్‌రెడ్డి, నందారం వెంకటయ్యలు ముఖ్యులు. గురునాథ్‌రెడ్డి ఐదుసార్లు, నందారం వెంకటయ్య మూడు సార్లు గెలిచారు. ఈ ప్రాంతంలో ఒకసారి కాంగ్రెస్‌ను గెలిపిస్తే మరోదఫా టీడీపీని గెలిపించేవారు. 2018 ఎన్నికల వరకు కాంగ్రెస్, తెలుగుదేశం మధ్యనే పోటీ ఉండేది. ప్రస్తుతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే ప్రధాన పక్షాలుగా పోటీ చేస్తున్నాయి. నియోజకవర్గానికి 14 సార్లు సార్వత్రిక ఎన్నికలు కాగా ఒక సారి ఉప ఎన్నిక జరిగింది. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒకసారి మాత్రమే కొడంగల్‌కు మంత్రి పదవి దక్కింది.

ఎవరెన్ని సార్లు గెలిచారు

నియోజకవర్గం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఐదు సార్లు, టీడీపీ నాలుగు సార్లు, స్వతంత్ర అభ్యర్థులు నాలుగుసార్లు గెలిచారు. 1996లో ఉప ఎన్నికలో టీడీపీ గెలిచింది. 2018లో మొదటిసారి కొడంగల్‌లో టీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించారు.

నియోజకవర్గం ఏర్పడిందిలా..

1956లో కొడంగల్ కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలతో పాటు మద్దూరు, దామరగిద్ద మండలాల్లోని పలు గ్రామాలు కోయిలకొండలోని ఒక గ్రామ పంచాయతీ కలిసి నియోజకవర్గంగా ఉండేది. 2018 వరకు కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, మద్దూర్ మండలాలు కొడంగల్ నియోజకవర్గంలో ఉన్నాయి. 2023 ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన మూడు మండలాలు దుద్యాల, కొత్తపల్లి, గుండుమాల్ కలిశాయి. దీంతో ప్రస్తుతం 8 మండలాలు నియోజకవర్గంలో ఉన్నాయి. తెలంగాణా ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతో కొడంగల్, కోస్గి పట్టణాలకు పురపాలిక హోదా దక్కింది. కొడంగల్‌తో పాటు కొండారెడ్డిపల్లి, ఐనన్‌పల్లి, బూల్కాపూర్, పాత కొడంగల్, గుండ్లకుంటను కలిపి మున్సిపాలిటీగాను, కోస్గితోపాటు పోతిరెడ్డిపల్లి, సంపల్లి, మల్‌రెడ్డిపల్లి, గుండ్లపల్లి, తిమ్మాయపల్లి, మాసాయపల్లి, నాగుసాన్‌పల్లిను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు.

1994లో తెలుగుదేశం పక్షాన గెలిచిన నందారం వెంకటయ్య 1996లో చనిపోవడంతో కొడంగల్‌లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో దివంగత నందారం వెంకటయ్య రెండో కుమారుడు నందారం సూర్యనారాయణ టీడీపీ టికెట్‌పై గెలిచారు.

ఒక్కసారే మంత్రి యోగం..

నియోజకవర్గం ఏర్పడి 62 ఏళ్ల గడుస్తున్నా మంత్రి పదవి మాత్రం ఒక్కసారే దక్కింది. నాగర్‌కర్నూల్ నుంచి ఇక్కడికి వచ్చి గెలిచిన అచ్యుతారెడ్డికి 1967లో మంత్రి పదవి లభించింది. కొంతకాలం రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 56ఏళ్లు అయినా మంత్రి యోగం దక్కలేదు.

సామాజిక వర్గాల వారీగా ఓటర్లు

ముదిరాజులు 60 వేలు, మున్నూరుకాపులు 30 వేలు, గొల్ల కురుమలు 40 వేలు, రెడ్లు 20 వేలు, ముస్లింలు 20వేలు, ఎస్సీలు 20వేలు, ఎస్టీలు 15 వేలు, వైశ్యులు, బ్రాహ్మణులు, కమ్మరి, కుమ్మరి, స్వర్ణకారులు, ఇతర కులస్తులు 35 వేలు.

నియోజకవర్గంలో ముదిరాజులు, మున్నూరు కాపులు, గొల్లకురుమలు, ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారు. కొడంగల్, కోస్గి మండలంలో మున్నూరుకాపుల ప్రాభల్యం అధికంగా ఉంది. మద్దూరు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌లో ముదిరాజు, యాదవ, రెడ్డి, లంబాడ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు. బొంరాస్‌పేటలో తండాలు అధికంగా ఉన్నాయి. ఎస్టీల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. దౌల్తాబాద్‌లో మున్నూరుకాపులు, ముదిరాజులు, ఎస్సీలు, రెడ్డి వర్గాల వారు ఉన్నారు. నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అధికంగా ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికం. మున్నూరు కాపు, ముదిరాజ్, ముస్లిం, మాదిగ, లంబాడ కులస్తుల ఓట్లు ఎన్నికలను ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటి వరకు వివిధ సామాజిక వర్గాలకు చెందిన బలమైన నాయకులు పోటీ చేశారు. గతంలో నందారం వెంకటయ్య, గురునాథ్‌రెడ్డి కుటుంబాల మధ్యనే రాజకీయం నడిచింది. గెలుపుఓటములు ఈ రెండు కుటుంబాల మధ్యనే ఉండేవి. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రేవంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి మధ్య పోటీ నెలకొంది.

నాటి కర్రకల్లు.. నేటి కొడంగల్

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లాలో కొడంగల్ ఉన్నందున ఈ ప్రాంత ప్రజలు కన్నడ భాషను మాట్లాడేవారు. ఇక్కడ నల్ల బండరాళ్లు ఎక్కువగా దొరికేవట. అందుకే ఈ ప్రాంతంలోని ప్రతి ఇంటి పైకప్పు నల్లరాళ్లతోనే కప్పి ఉంటాయి. కన్నడ భాషలో కల్లు అంటే రాయి అని అర్థం. ఈ నియోజకవర్గం కర్ణాటకలో ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని కర్రకల్లు అని పిలిచేవారు. కాలక్రమంలో కర్రకల్లు కొడంగల్‌గా మారిందని పెద్దలు చెబుతారు. నిజాం పాలనలో కర్రకల్లును హిమాయత్‌నగర్‌గా మార్చా లని భావించారట. అయితే ఆ తర్వాత ఏర్పడిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో అది సాధ్యం కాలేదు.

హ్యాట్రిక్ తప్పిన నేతలు

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రెండుసార్లు హ్యాట్రిక్ తప్పిపోయింది. 1978, 1983లో వరుసగా విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దీంతో హ్యాట్రిక్ తప్పిపోయింది. మరోసారి 1999, 2004లో ఆయన గెలిచారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇలా రెండుసార్లు ఆయనకు హ్యాట్రిక్ తప్పింది. ఎనుముల రేవంత్ రెడ్డి 2009, 2014లో వరుసగా గెలిచారు. 2018లో ఓడిపోవడంతో ఆయనకు హ్యాట్రిక్ తప్పింది.

జంగ్ తెలంగాణ


నరేందర్‌రెడ్డి


రేవంత్‌రెడ్డి


గురునాథ్‌రెడ్డి


దివంగత నందారం వెంకటయ్య


దివంగత నందారం సూర్యనారాయణ


దివంగత అచ్యుతారెడ్డి

నియోజకవర్గం : కొడంగల్

మండలాలు : కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల, మద్దూరు, కోస్గి, కొత్తపల్లి, గుండుమాల్.


మున్సిపాలిటీలు : కొడంగల్, కోస్గి

కొడంగల్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య **2,30,251**

పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు
1,14,140	1,16,099	12

ఎమ్మెల్యేలుగా గెలుపొందినవారు..

- 1957లో అచ్యుతారెడ్డి (కాంగ్రెస్)
- 1962లో రుక్మారెడ్డి (స్వతంత్ర)
- 1967లో అచ్యుతారెడ్డి (స్వతంత్ర)
- 1972లో నందారం వెంకటయ్య (స్వతంత్ర)
- 1978లో గురునాథ్‌రెడ్డి (స్వతంత్ర)
- 1983లో గురునాథ్‌రెడ్డి (కాంగ్రెస్)
- 1985లో నందారం వెంకటయ్య (టీడీపీ)
- 1989లో గురునాథ్‌రెడ్డి (కాంగ్రెస్)
- 1994లో నందారం వెంకటయ్య (టీడీపీ)
- 1996లో సూర్యనారాయణ (ఉపఎన్నిక, టీడీపీ)
- 1999లో గురునాథ్‌రెడ్డి (కాంగ్రెస్)
- 2004లో గురునాథ్‌రెడ్డి (కాంగ్రెస్)
- 2009లో రేవంత్‌రెడ్డి (టీడీపీ)
- 2014లో రేవంత్‌రెడ్డి (టీడీపీ)
- 2018లో నరేందర్‌రెడ్డి (టీఆర్‌ఎస్)


కొడంగల్ మ్యాప్

స్వాతంత్ర్యానికి పూర్వమే పురపాలిక

కొడంగల్ పట్టణం స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం పాలనలో మున్సిపాలిటీగా ఉండేది. అప్పట్లో హైదరాబాద్ నవాబుల పాలనలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని ఇతర పట్టణాలకు వెళ్లాలంటే కొడంగల్ మీదుగా వెళ్లేవారు. వారి హయాంలోనే హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకు కొడంగల్ మీదుగా రహదారి నిర్మించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పూర్వం అంటే 1956 వరకు ఈ నియోజకవర్గం ప్రస్తుత ఈశాన్య కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లాలో ఉండేది.

సీఐ హత్య కేసు.. కానిస్టేబుల్ దంపతులకు రిమాండ్

- పరారీలో మరో యువకుడు
- బండరాయితో బలంగా కొట్టడంతోనే సీఐకి తీవ్రగాయాలు
- కత్తితో శరీర భాగాలపై గాట్లు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ టి.మహేష్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ టి.మహేష్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్‌శాఖలో సంచలనం సృష్టించిన సీసీఎస్ సీఐ ఇఫ్తికార్ అహ్మద్ హత్య కేసులో ఇద్దరు నేరుస్తులను పోలీసులు రిమాండ్‌కు తరలించగా మరొకరు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి డీఎస్పీ టి.మహేష్ వెల్లడించారు. బోయ జగదీష్, శకుంతల ఇద్దరూ 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు. వీరు 2011లో ప్రేమ వివాహం చేసుకోగా.. ఇద్దరు కుమారులు సంతానం. మొదట భార్యాభర్తలు ఇద్దరు అచ్చంపేటలో పనిచేశారు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. అయితే సీఐ ఇఫ్తికార్ అహ్మద్ 2018లో మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీ సీఐగా ఉన్న సమయంలో శకుంతల మహిళా పోలీస్‌స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహిస్తుంది. ఆ సమయంలో ఇద్దరూ కేసుల వ్యవహారంలో తరచుగా కోర్టు దగ్గర కలవడం, రెగ్యులర్‌గా మాట్లాడుకోవడం, ఆ తర్వాత సీఐ నిత్యం ఆమెతో వాట్సాప్ చాట్, మెసేజ్‌లు చేశాడు. అక్కడి నుంచి మరికల్ సీఐగా వెళ్లిన తర్వాత కూడా తరచుగా మాట్లాడటం, చాట్ చేశాడు. ఈ విషయం భర్త జగదీష్‌కు తెలియడంతో అప్పటి మహబూబ్‌నగర్‌లో ఓ సీఐ దగ్గర కౌన్సెలింగ్ ఇప్పించి పేపర్ రాసుకోవడం జరిగింది. ఆ తర్వాత సీఐ మరికల్ నుంచి కొడంగల్‌కు బదిలీ కావడం, ఆ తర్వాత సస్పెండ్ కావడంతో కొన్ని రోజులు దూరంగా ఉన్నాడు.

దాడి చేసి వార్నింగ్ ఇచ్చినా.. తీరు మారలే..

ఇఫ్తికార్ అహ్మద్ 2022 డిసెంబర్ 10న తిరిగి సీసీఎస్ సీఐగా మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో పాత పరిచయం మళ్లీ మొదలై.. కొత్త నంబర్స్‌తో చాట్ చేయడం మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ భర్త 2023 మార్చి 8న ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో సీఐ ఇఫ్తికార్ అహ్మద్, శకుంతలను ఇలాంటి వ్యవహారం మానుకోవాలని హెచ్చరిండంతో పాటు సీఐపై దాడి చేసి వార్నింగ్ సైతం ఇచ్చాడు. ఈ విషయాన్ని మరో వ్యక్తితో సెల్‌ఫోన్‌లో వీడియో కూడా తీయించాడు. ఆ తర్వాత కూడా సీఐ ఇఫ్తికార్ అహ్మద్ తరచుగా ఎంవీఎస్ కళాశాల వైపు వెళ్లడం, శకుంతల వెళ్లే సమయంలో వెంట వెళ్లి మాట్లాడటం చేశాడు. అప్పటికే సీఐ ప్రవర్తనపై నిఘా పెట్టిన కానిస్టేబుల్ జగదీష్ 11 ఏళ్లుగా వాళ్ల ఇంట్లో పనిచేసే కృష్ణ అనే యువకుడికి సీఐ గురించి మొత్తం వివరాలు చెప్పి అతను ఆ రూట్‌లో తిరిగినా.. ఇంటికి వచ్చినా తనకు చెప్పాలని సూచించాడు. ఈ క్రమంలో ఈ నెల 1న రాత్రికి సీఐ మళ్లీ శకుంతలకు మెసేజ్ చేసి మీ ఆయన డ్యూటీలో ఉన్నాడని అతను డ్యూటీలో ఉన్న ఫొటో ఆమెకు పెట్టాడు. తాను వస్తానని చెప్పి రాత్రి 11.20 ప్రాంతంలో శకుంతల ఇంటికి వెళ్లాడు. సీఐ వచ్చిన విషయం గమనించిన కృష్ణ వెంటనే కానిస్టేబుల్ జగదీష్‌కు ఫోన్ చేసి సమాచారం చెప్పడంతో నైట్ డ్యూటీలో ఉన్న అతను రాత్రి 11.35 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన వెంటనే సీఐ ఇఫ్తికార్ అహ్మద్‌పై జగదీష్‌తో పాటు కృష్ణ దాడి చేసి మెడ, ముఖంపై తీవ్రంగా కొట్టి సీఐని అతని కారు మధ్య సీటులో వేశాడు. అప్పటికే కృష్ణకు ఇంటి నుంచి దూరంగా ఖాళీ స్థలం ఎక్కడ ఉందో చూసి రావాలని పంపించి ఇతను మళ్లీ రాత్రి 2 గంటల ప్రాంతంలో వన్‌టౌన్ చౌరస్తాకు వచ్చి డ్యూటీలో ఉన్నట్లు ఓ ఫొటో దిగి పోలీస్‌స్టేషన్ వాట్సాప్ పంపాడు.

➡ ఆ తర్వాత మళ్లీ ఇంటి దగ్గరకు వెళ్లగా అప్పటికే కృష్ణ కారును తీసుకువెళ్లి మర్లు పాలకొండ రూట్‌లో నిలిపాడు. తెల్లవారుజామున 3.36 గంటల ప్రాంతంలో జగదీష్ అక్కడికి చేరుకుని ఇఫ్తికార్ అహ్మద్‌పై బండరాయితో తలపై దాడి చేయడం, అప్పటికే వెంట తెచ్చుకున్న కత్తితో శరీర భాగాలను కట్ చేశాడు. ఈ క్రమంలోనే సీఐ మర్మాంగం సైతం కొంత భాగం కట్ అయింది. ఆ తర్వాత కానిస్టేబుల్ జగదీష్ సీఐ ప్యాంట్ తీసి.. అతని చేతులకు ఉన్న రక్తం శుభ్రం చేసి ఆధారాలు లేకుండా చేసే ప్రయత్నం చేశాడు. అక్కడి నుంచి తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో జగదీష్, కృష్ణ ఇద్దరూ నడుచుకుంటూ ఇంటికి వస్తున్న క్రమంలో కత్తి అక్కడే ఉన్న మురుగు కాల్వలో పడేశాడు. ఆ తర్వాత జగదీష్ ఒంటిపై ఉన్న దుస్తులు, ఇంట్లో రక్తం శుభ్రం చేసిన దుస్తులు తగలబెట్టాడు. అప్పటికే శకుంతల ఇంట్లో పడిన రక్తం నీటితో శుభ్రం చేయడంతో పాటు అక్కడే పడిపోయిన సీఐ టీషర్ట్ తీసి ఇంటిపై పారేసింది. ఈ విషయాన్ని శకుంతల ఆమె బంధువుకు ఫోన్ చేసి చెప్పగా.. సదరు వ్యక్తి వెంటనే ఉన్నతాధికారులకు చెప్పాలని సూచించడంతో ఆ తర్వాత శకుంతల పోలీసులకు ఫోన్ చేసి సీఐని తన భర్త కారులో బైపాస్ వైపు తీసుకువెళ్లాడని చెప్పింది. అప్పటికే తెల్లవారుజామున ఆ రోడ్డుపై వెళ్తున్న వాకర్ వంశీ అనే వ్యక్తి సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సీఐని చికిత్స కోసం ఎస్‌వీఎస్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 7న ఉదయం 11.13 గంటలకు మృతి చెందాడని డీఎస్పీ తెలిపారు. మొదట ఎఫ్ఐఆర్‌లో 307, 201 సెక్షన్స్ కింద కేసు నమోదు చేశాడమని, సీఐ మృతి చెందిన తర్వాత 302, 201 సెక్షన్స్ కింద కేసులు నమోదు చేసి ఏ1 జగదీష్, ఏ2 శకుంతలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఏ3 కృష్ణ పరారీలో ఉన్నాడని చెప్పారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, హత్య చేయడానికి వాడిన బండరాయి, టీషర్ట్, రికవరీ చేసినట్లు వివరించారు.

బర్రెలక్క నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న శిరీష (బర్రెలక్క)

సోషల్ మీడియాలో వీడియోలు చేస్తూ బర్రెలక్కగా పాపులర్ అయిన శిరీష నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు. నోటిఫికేషన్లు లేక ఉద్యోగాలు రావడం లేదని, అందుకే తాను బర్రెలు మేపడానికి వచ్చానంటూ చేసిన రీల్ సోషల్‌మీడియాలు వైరల్‌గా మారింది. అయితే నిరుద్యోగుల తరుపున నామినేషన్ వేశానని అందరూ తనకు మద్దతు ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

- కొల్లాపూర్

హోంమంత్రి వాహనం తనిఖీ


హోంమంత్రి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహిస్తున్న మైనార్టీ ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ వాహనాన్ని పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎస్ఐ హరిప్రసాద్ తనిఖీ చేశారు. పోలీసులు వాహనాన్ని ఆపడంతో హోం మంత్రి దిగి పోలీసులకు సహకరించారు. వాహనాన్ని పరిశీలించి పంపించారు.

తనిఖీల్లో నగదు సీజ్

నారాయణపేట రూరల్: మండలంలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులకు ఒక వాహనంలో రూ.90,500నగదు గుర్తించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అక్కడ విధుల్లో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్ వేమన ఆధ్వర్యంలో వాటిని సీజ్ చేసి గ్రీవియన్ కమిటీకి పంపించినట్లు తెలిపారు.

కొత్తకోట రూరల్: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. బుధవారం పెద్దమందడి మండలం మోజర్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్నండగా హైదరాబాద్ నుంచి వనపర్తి వెళ్తున్న పుల్లయ్య కారును ఆపి తనిఖీ చేయడంతో రూ.1,10,000 నగదు లభించింది. నగదుకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు. అదేవిధంగా కామారెడ్డి నుంచి వనపర్తికి కారులో వెళ్తున్న రాజు నుండి రూ.50,500 నగదు లభించింది. ఎలాంటి అనుమతులు లేకపోడంతో సీజ్ చేసినట్టు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఎమ్మెల్యే మర్రి ఆస్తులు రూ.116.66 కోట్లు

- ఆయన భార్య జమున ఆస్తుల విలువ రూ.83.67 కోట్లు
- కుటుంబసభ్యుల మొత్తం ఆస్తుల విలువ రూ.200 కోట్లు
- ఎన్నికల అఫిడవిట్‌లో మర్రి జనార్దన్‌రెడ్డి ఆస్తుల వివరాలు వెల్లడి



సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే, భారత్ రాష్ట్ర సమితి అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి మొత్తం ఆస్తుల విలువ రూ.116.66 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. అలాగే రూ. 12.58 కోట్లు అప్పులు ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఆయన భార్య జమున పేరిట మొత్తం రూ. 83.67 కోట్ల ఆస్తులు ఉండగా, రూ. 13.93 కోట్లు అప్పులు ఉన్నట్లుగా బుధవారం నామినేషన్ సందర్భంగా ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించారు. కాగా 2018 ఎన్నికల అఫిడవిట్‌లో మొత్తం ఆస్తుల విలువ రూ.118.02 కోట్లుగా ప్రస్తావించగా ప్రస్తుత అఫిడవిట్‌లో ఆస్తుల విలువ సుమారు రూ.2కోట్లు తగ్గింది. అలాగే అప్పులు రూ.36.91 కోట్ల నుంచి రూ.12.58 కోట్లకు తగ్గాయి. ప్రస్తుత ఎన్నికల అఫిడవిట్ ప్రకారం భార్యాభర్తల మొత్తం ఆస్తుల విలువ రూ.200.33 కోట్లు కాగా, మొత్తం అప్పులు రూ. 26.51 కోట్లు ఉన్నట్టు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి జమున ఆస్తులు, అప్పుల వివరాలు

2018లో	
మర్రి జనార్దన్‌రెడ్డి	చరాస్తులు రూ. 75,38,97,659
	చరాస్తి కొనుగోళ్లు రూ. 19.85 కోట్లు
	స్థిరాస్తుల విలువ రూ. 22.76 కోట్లు
	నగదు: 4.92 లక్షలు
	అప్పులు రూ. 36.91 కోట్లు
మర్రి జమునారెడ్డి	చరాస్తులు రూ. 15,86,71,810
	చరాస్తి కొనుగోళ్లు రూ. 35.12 కోట్లు
	స్థిరాస్తుల విలువ రూ. 47.25 కోట్లు
	నగదు: రూ. 3.06 లక్షలు
	అప్పులు రూ. 26.22 కోట్లు
2023లో	
మర్రి జనార్దన్‌రెడ్డి	చరాస్తులు రూ.78,87,40,407
	చరాస్తి కొనుగోళ్లు రూ. 5.76 కోట్లు
	స్థిరాస్తుల విలువ రూ. 8.16 కోట్లు
	నగదు: 1.91 లక్షలు
	అప్పులు : 12.58 కోట్లు
మర్రి జమునారెడ్డి	చరాస్తులు: రూ.15,38,60,813
	చరాస్తి కొనుగోళ్లు: రూ.5.02 కోట్లు
	స్థిరాస్తుల విలువ: రూ.31.25 కోట్లు
	నగదు: రూ.1.91 లక్షలు
	అప్పులు: రూ.13.93 కోట్లు

2018 ఎన్నికల అఫిడవిట్‌లో ఎమ్మెల్యే మర్రిపై ఎలాంటి కేసులు లేవని పేర్కొనగా, ప్రస్తుత అఫిడవిట్‌లో తనపై తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబరు 113/2023 కేసులో ఐపీసీ 506 సెక్షన్ కింద కేసు నమోదైనట్టు వెల్లడించారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఆస్తి విలువ రూ.45.30 కోట్లు


కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అభ్యర్థి కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తరుపున ఆయన తండ్రి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి బుధవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇందులో ఆయన ఆస్తులకు సంబంధించిన వివరాలను సమర్పించారు. తన పేరుపై రూ.13,73,74,043, భార్య సరిత పేరుపై రూ.45,30,66,743 ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తి మృతి


అహ్మద్(ఫైల్)

భూత్పూర్: భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ 'సాక్షి' గణపతి దేవాలయం వద్ద బుధవారం రాత్రి కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఇందులో బైక్‌పై ఉన్న వ్యక్తి మృతి చెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భూత్పూర్ పట్టణానికి చెందిన అహ్మద్(28), గౌస్‌పాష, గడ్డం పవన్‌కుమార్ మోటార్ సైకిల్‌పై మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్‌కు వస్తుండగా, నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న టీఎస్ 07హెచ్ 5566 కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో అహ్మద్, గౌస్‌పాష, గడ్డం పవన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అహ్మద్ మృతిచెందాడు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

పూటకో పార్టీ మార్పు


బీఆర్‌ఎస్‌లో చేరిన రాంరెడ్డి

జడ్చర్ల: ఉదయం ఓ పార్టీలో మరి కొద్ది సేపటికే మరో పార్టీలో కనిపిస్తున్న వారిని చూసి ప్రజలు ఔరా అనుకుంటున్నారు. నియోజకవర్గంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రచారం చేస్తున్న సమయంలో మండలంలోని పెద్దపల్లికి చెందిన రాంరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ కండువా వేసి ఆయనను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. మరికొద్ది సేపటికే ఈయన కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యా యి. ఇలా గంటగంటకి పార్టీలు మారుతుండడంతో ఓ వైపు నాయకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు ఏపార్టీలో ఎంతసేపు ఉంటున్నారో తెలియక తికమక పడుతున్న పరిస్థితి నెలకొంది.


కాంగ్రెస్‌లో చేరిన రాంరెడ్డి



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు
పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే
ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు.
పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు
వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు.
ఇందులో భాగంగా ఇటీవల
మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది.
కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో
దేదీప్యమానంగా వెలిగిపోవాలి.
అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు
అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స
చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి,
కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి
ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో
అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు..
వికటిస్తున్న పరిణామాలు ఏమిటి?
భేష్ అనదగిన విధానాలేమిటి?
అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్ప నక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు. చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు. పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు


డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.



టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?

దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తిన డానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.



అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.



లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

పాఠాలతో ఫైనలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...


ఫౌజియా

దిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగోచెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత దిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.